క్లుప్తంగా

సమస్యలకు సత్వర పరిష్కారం



సమస్యలు తెలుసుకుంటున్న అడిషనల్ కమిషనర్

కర్నూలు (టౌన్): స్పందన కార్యక్రమం దృష్టికి వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ అన్నారు. సోమవారం స్థానిక నగరపాలకలోని కౌన్సిల్ హాలులో స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ కాలనీల ప్రజలు స్పందనలో పలు సమస్యలపై అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నగరపాలక మేనేజర్ చిన్న రాముడు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



ధర్నా నిర్వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

కర్నూలు(సెంట్రల్) : ఉపాధి హామీలో పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. సోమవారం ఫీల్డ్ అసిస్టెంట్లు తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ జెడ్పీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేసి అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కనీస వేతనంగా నెలకు రూ.26 వేలు ఇవ్వాలన్నారు. అలాగే పీఎఫ్,ఈఎస్ఐ సదుపాయాలు కల్పించి, రాజకీయ ఒత్తిళ్లతో ఉద్యోగాల నుంచి తొలగించే పద్ధతికి స్వస్తి చెప్పాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బొజ్జప్ప, గిడ్డయ్య, దేవానంద్ పాల్గొన్నారు.


దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఏఐకేఎస్ నాయకులు



పంట పొలాలను పరిశీలిస్తున్న ఏఐకేఎస్ బృందం

కర్నూలు(సెంట్రల్): మండల పరిధిలోని ఉల్చాల గ్రామంలో వర్షాభావంతో దెబ్బతిన్న ఖరీఫ్ పంట పొలాలను ఏఐకేఎస్ జాతీయ కార్యదర్శి విజ్జు కృష్ణన్, ఆర్థిక కార్యదర్శి కృష్ణప్రసాదు, జాతీయ నాయకులు నితీష్, ఏపీ రైతు సంఘం అధ్యక్ష,కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకరరెడ్డి, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడి పెట్టుబడి, వర్షాలు, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. పత్తి, మిరపలో ఎకరాకు రూ.40 వేల పెట్టుబడి పెడితే రూ.6 వేలు చేతికి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకునేలా రైతు సంఘాలు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

రాక్‌వుడ్ చర్చిలో ఘనంగా క్యాండిల్ లైటింగ్



క్యాండిల్ లైటింగ్ కార్యక్రమంలో భైవ గీతాలు ఆలపిస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్) : నగరంలోని స్థానిక ఆర్ఎస్ రోడ్డులో ఉన్న రాక్‌వుడ్ చర్చిలో సోమవారం రాత్రి క్యాండిల్ లైటింగ్ సర్వీసు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ రెవరెండ్ సజీవన్ మాట్లాడుతూ యేసు ప్రభువు సర్వ మానవాళికి ప్రేమ మార్గాన్ని బోధించారన్నారు. చర్చి కోయర్ డైరెక్టర్ ఇమ్మానియేలు రాజు, డాక్టర్ సుప్రియ సారథ్యంలో క్వయర్ బృందం మధుర గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో పాస్టర్ కిషోర్ కుమార్, క్రిస్మస్ కమిటీ చైర్మన్ ఆనందరావు, వైస్ చైర్మన్ బెంజమిన్ రాజు, కోశాధికారి స్వరూప్, చర్చి సభ్యులు రాబర్టు, రాజు, రాజేష్ డేవిడ్ విజయ్‌కుమార్ సురేంద్ర పాల్గొన్నారు.

ఆటకు సన్నద్ధం !

క్రీడారంగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. ప్రతిభవంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించడమే లక్ష్యంగా ఇప్పటికే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వివిధ క్రీడా పోటీలు, సీఎం కప్ పోటీలు నిర్వహించిన సర్కారు తాజాగా 'ఆడుదాం..ఆంధ్ర' క్రీడా పోటీలకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో ఈనెల 26 నుంచి ప్రారంభమయ్యే ఈ పోటీలకు విశేష స్పందన లభిస్తోంది. పెద్ద సంఖ్యలో క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు.

- జిల్లాలో ఈ నెల 26 నుంచి 'ఆడుదాం- ఆంధ్ర' క్రీడా పోటీలు
- 5 క్రీడాంశాల్లో నిర్వహణ
- క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా పోటీలు
- ముమ్మరంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ
- విజేతలకు నగదు ప్రోత్సాహకాలు, మెడల్స్, ప్రశంసాపత్రాలు
- పోటీల నిర్వహణకు చకచక ఏర్పాట్లు



కర్నూలు స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం



ఆడుదాం..ఆంధ్ర పోటీలకు గార్గేయపురంలో క్రీడా మైదానాన్ని చదును చేస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్) : జిల్లా వ్యాప్తంగా క్రీడల పండుగ ప్రారంభకానుంది. ఏకంగా 50 రోజుల పాటు ఆడుదాం..ఆంధ్ర క్రీడాపోటీలు జరగనున్నాయి. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖో-ఖో, కబడ్డీ వంటి 5 క్రీడాంశాల్లో నిర్వహించే ఈ పోటీలు గ్రామ/వార్డు స్థాయిలో ఈనెల 26న ప్రారంభమై జనవరి 1 వ తేదీ వరకు జరుగుతాయి. మండల స్థాయిలో జనవరి 2 వ తేదీ నుంచి 15 వ తేదీ వరకు, నియోజకవర్గ స్థాయిలో 16 నుంచి 21 వ తేదీ వరకు జిల్లా స్థాయిలో 22 నుంచి 28 వ తేదీ వరకు, రాష్ట్ర స్థాయిలో 29 నుంచి ఫిబ్రవరి 3 వ తేదీ వరకు పోటీలు జరుగుతాయి. గ్రామ/వార్డు స్థాయి నుంచి పోటీలు నిర్వహిస్తుండటంతో గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు అవకాశం కలుగుతుంది.ఈ ఉద్దేశంతోనే ప్రభుత్వం ఆడుదాం ..ఆంధ్ర పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుంది.

అధికారులు ఇప్పటికే జిల్లా కేంద్రంతో పాటు నియోజవర్గ స్థాయి, మండల స్థాయి, గ్రామీణ స్థాయిలో క్రీడా మైదానాలను గుర్తించారు. పోటీల నిర్వహణకు అవసరమైన పనులు చురుగ్గా సాగుతున్నాయి. సచివాలయాలకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. కర్నూలు, పత్తికొండ, ఆదోని ప్రాంతాల్లో ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలకు ఆడుదాం-ఆంధ్ర క్రీడలకు సంబంధించి శిక్షణ కూడా ఇచ్చారు.

60వేల మందికి పైగా క్రీడాకారుల రిజిస్ట్రేషన్

ఆడుదాం- ఆంధ్ర పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా పేర్లను నమోదు చేసుకోవాలి. గ్రామ, మండల స్థాయిలో వ్యక్తిగతంగా లేదా గ్రూపుగా పేర్లను నమోదు చేసుకోవచ్చు. ఇందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ గ్రామ/వార్డు సచివాలయాల్లో ఇప్పటికే ప్రారంభమైంది. 15 సంవత్సరాలు దాటిన మహిళలు, పురుషులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. ఆసక్తి గలవారు 1902కు కాల్ చేసి లేదా https://aadudamandhra.ap.gov.in లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. కాగా ఇప్పటి వరకు 60 వేల మందికి పైగా క్రీడాకారులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

జిల్లాలో 394 క్రీడా మైదానాల గుర్తింపు

జిల్లావ్యాప్తంగా ఆడుదాం-ఆంధ్ర పేరుతో నిర్వహిస్తున్న క్రీడల కోసం జిల్లా క్రీడల అభివృద్ధి అధికారులు, స్థానిక మండల పరిషత్ అధికారులు పీఈటీల సహకారంతో 394 క్రీడా మైదానాలను గుర్తించారు. ఆయా స్థలాలను క్రీడా పోటీలకు అనువుగా చదును చేసే కార్యక్రమం ప్రస్తుతం ముమ్మరంగా సాగుతోంది.

విజేతలకు నగదు ప్రోత్సాహకాలు, మెడల్స్

ఆడుదాం- ఆంధ్ర క్రీడా పోటీల్లో విజేతలకు ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలు, ట్రోఫీలు, మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేయనుంది. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో క్రీడాంశాల్లో నియోజకవర్గ స్థాయిలో మొదటి బహుమతి 35 వేలు, రెండో బహుమతి రూ. 15 వేలు, మూడో బహుమతి రూ. 5 వేలు, జిల్లా స్థాయిలో మొదటి బహుమతి రూ.60 వేలు రెండో బహుమతి రూ. 30 వేలు, మూడో బహుమతి రూ. 10 వేలు, రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి రూ. 5 లక్షలు, రెండో బహుమతి రూ.3 లక్షలు, మూడో బహుమతి రూ. 2లక్షలు ఉంటుంది. అలాగే బ్యాడ్మింటన్ క్రీడాంశంలో నియోజకవర్గ స్థాయిలో మొదటి బహుమతి రూ. 20 వేలు, రెండో బహుమతి రూ. 10 వేలు, మూడో బహుమతి రూ. 5 వేలు, జిల్లా స్థాయిలో మొదటి బహుమతి రూ. 35 వేలు, రెండో బహుమతి రూ. 20 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు, రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి రూ. 2 లక్షలు రెండో బహుమతి రూ. 1 లక్ష, మూడో బహుమతి రూ.50 వేలు అందజేస్తున్నట్లు సర్కారు ప్రకటించింది.

50 రోజుల క్రీడా పండుగ



ఆరోగ్య వంతమైన ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడంలో భాగంగా ప్రభుత్వం క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుంది. ఇందులో భాగంగా జిల్లాలో ఆడుదాం-ఆంధ్ర పేరుతో క్రీడలను నిర్వహిస్తుంది. ఇది 50 రోజుల క్రీడల పండుగ. 5 క్రీడాంశాల్లో నిర్వహిస్తున్న ఈ పోటీలకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటికే జిల్లాలో క్రీడా మైదానాలు గుర్తించాం. చదును చేసే పనులు కూడా పూర్తి కావచ్చాయి. ఈనెల 26 నుంచి క్రీడా పోటీలు ప్రారంభం కానున్నాయి. అందరి సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతం చేస్తాం. – శ్రీనివాసరావు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి

మహనీయులను స్మరించుకోవాలి



మహనీయుల విగ్రహాల ఆవిష్కరణలో నాయకులు

గూడూరు రూరల్ : మహనీయులను ప్రతి ఒక్కరూ స్మరించుకుని వారి ఆశయాల కోసం పోరాడాలని కర్నూలు నగరానికి చెందిన మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ హరిప్రసాద్ అన్నారు. కె.నాగలాపురంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం అంబేడ్కర్, పూలే, సావిత్రిబాయి, ఫాతిమా షేక్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం ఇంటెలెక్చువల్ కలెక్టివ్ సంస్థ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళా ఐక్య వేదిక ఆధ్వర్యంలో జరిగింది. బీసీ జాతీయ సంఘం అధ్యక్షుడు నక్కలమిట్ట శ్రీనివాసులు, ఇంటెలెక్చువల్ కలెక్టివ్ సంస్థ జిల్లా కన్వీనర్ ఖదీరుల్లా, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళా ఐక్య వేదిక ప్రతినిధి పట్నం రాజేశ్వరి, బీసీ నాయకులు శేషఫణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, హక్కుల కోసం పోరాడి యువతను జాగృతం చేసిన అంబేడ్కర్, పూలే, సావిత్రిబాయి, ఫాతిమా షేక్‌లను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వారి ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన తెలిపారు. ఇప్పటి వరకు 50కి పైగా ప్రాంతాల్లో విగ్రహాలను ఆవిష్కరించినట్లు తెలిపారు. సర్పంచు నయోమి, హెడ్ మాస్టర్ దాదామియ్యా, రచయిత ఇనాయతుల్లా, పీఎంసీ చైర్మన్ దాసు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బీసీ సెల్‌లో 8 మందికి చోటు

ఓర్వకల్లు : వైఎస్సార్‌సీపీ అనుబంధమైన బీసీ సెల్‌లో నియోజకవర్గం నుంచి 8 మందికి స్థానం లభించింది. ఈ మేరకు జిల్లా పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. జనరల్ సెక్రటరీలుగా కె. నాగేశ్వరమ్మ, సి.మధు(శకునాల), కార్యదర్శులుగా బి.భాస్కర్ నాయుడు(కాల్వబుగ్గ), కె.శేషయ్య, వి.లక్ష్మీకాంతయ్య, సంయుక్త కార్యదర్శులుగా టి. గోపినాథ్, పీ.శ్రీనివాసులు, దొమ్మరి మధులను నియమించారు. పార్టీ అనుబంధ కమిటీలలో స్థానం కల్పించిన స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి ఎంపికైన వారందరూ కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికల ఏర్పాట్లపై దృష్టి సారించాలి

- కలెక్టర్, ఎస్పీలకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా
- 22 ,23 తేదీల్లో ఎన్నికల సన్నద్ధతపై సమావేశం నిర్వహిస్తున్నట్లు వెల్లడి

కర్నూలు(సెంట్రల్): 2024 సాధారణ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన విజయవాడ నుంచి ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలు, పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు, వాటిలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని ఎన్నికల అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో నిరంతర విద్యుత్, మంచినీటి సదుపాయం, మరుగుదొడ్లు కచ్చితంగా ఉండేలా చూడాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అన్ని స్థాయిల్లో అధికారుల నియామకాలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. మరోవైపు శాంతి భద్రతలపై ఎస్పీలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు చేయాలన్నారు. కాగా, ఈనెల 22,23వ తేదీల్లో విజయవాడలో ఎన్నికల సన్నద్ధతపై కలెక్టర్లు, ఎస్పీలకు కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటి వరకు జిల్లాలో ఎన్నికల సన్నాహాలకు సంబంధించిన అన్ని నివేదికలతో హాజరు కావాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్, జేసీ నారపురెడ్డి మౌర్య, మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, కర్నూలు ఆర్డీఓ హరిప్రసాదు, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల డిమాండ్లు నెరవేర్చాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ

కర్నూలు (టౌన్) : అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ అన్నారు. స్థానిక శ్రీకృష్ణదేవరాయ సర్కిల్‌లో 7 రోజులుగా అంగన్‌వాడీలు చేస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లను సచివాలయ ఉద్యోగులకు అప్పగించరాదని రాష్ట్ర వ్యాప్తంగా అనేక చోట్ల ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వానికి కనిపించదా అని ప్రశ్నించారు. అంగన్‌వాడీల సమ్మె పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం తగదన్నారు.కార్యక్రమంలో సీపీఐ నాయకులు మునెప్ప, రామకృష్ణారెడ్డి, నిర్మల పాల్గొన్నారు.

నగరపాలక కార్యాలయాన్ని ముట్టడి

సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో అంగన్ వాడీలు సోమవారం నగరపాలక కార్యాలయాన్ని ముట్టడించారు. రెండు గంటలకు పైగా అక్కడ బైఠాయించారు. ఈ సందర్భంగా సీఐటీయూ శ్రామిక మహిళ రాష్ట్ర నాయకులు పి.నిర్మల, లలితమ్మ, గౌస్ దేశాయ్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, రసూల్, సుధాకరప్ప, విజయ రామాంజనేయులు మాట్లాడుతూ సచివాలయాలకు అంగన్ వాడీలను అప్పగించాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం నగరపాలక మేనేజర్ చిన్నరాముడును కలిసి వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు ఎస్టీబీసీ కళాశాల నుంచి అంగన్ వాడీలు ర్యాలీగా నగరపాలక కార్యాలయానికి చేరుకున్నారు.

క్రిస్మస్ కప్ విజేత ఏనుగుమర్రి జట్టు

కర్నూలు (టౌన్): క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన సెవన్ ఏ సైడ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఏనుగుమర్రి జట్టు విజేతగా నిలిచింది. బాలుర విభాగంలో ఈ జట్టు 0-1 గోల్స్ చేసి పెద్దపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జట్టుపై విజయం సాధించింది. రెండో సెమీ ఫైనల్స్‌లో లక్ష్మీపురం జిల్లా పరిషత్ జట్టు 3-0 గోల్స్ చేసి చెరుకుల పాడు జెడ్పీహెచ్ఎస్ జట్టుపై గెలుపొందింది. బాలికల విభాగంలో మొదటి సెమీఫైనల్ మ్యాచ్‌లో ఏనుగుమర్రి జట్టు 5-0 గోల్స్ చేసి చెరుకుల పాడు జెడ్పీహెచ్ఎస్ జట్టుపై విజయం సాధించింది. విజేతలకు జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ముప్పా రాజశేఖర్ ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ సంఘం సభ్యులు మహేష్, ఇజ్రాయిల్, బ్రహ్మకుమార్, పాల్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(రాజ్‌విహార్): ఆర్టీసీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీఎస్ఆర్టీసీ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ తులసీరామ్ కోరారు. సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో ఆర్టీసీ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి

కర్నూలు (టౌన్) : పెండింగ వేతనాలు చెల్లించి క్లాప్ డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని సీఐటీయూ నాయకులు అంజిబాబు, విజయరామాంజనేయులు, రాధాక్రిష్ణ విన్నవించారు. సోమవారం కర్నూలు కార్పొరేషన్, గార్గేయపురంలో తడిచెత్త, పొడిచెత్త సేకరణ, పారిశుద్ధ్య పనులు తనిఖీ చేసేందుకు కర్నూలుకు వచ్చిన స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ (ఎస్ఏసీ) మేనేజింగ్ డైరెక్టర్ గంధం చంద్రుడును కొత్తబ స్టాండ్ సమీపంలోని ఓ హోటల్ వద్ద వారు కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎండీ నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజతో సమస్యపై మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నగరపాలక ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

నాగమయ్య, లింగమయ్య విగ్రహాల ప్రాణప్రతిష్ఠ

కర్నూలు(సెంట్రల్): నగరంలోని బండిమెట్ట గంగాభవాని సమేత కేదారేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో నాగమయ్య, లింగమయ్య విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ జరిగింది. అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజల నిర్వహించి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులు నాగమయ్య, లింగమయ్యలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో భక్తులు జయశ్రీ, రమణ, చాపల రమేష్, జగన్, నరేష్, దాస్, శరత్‌బాబు,పెద్దయ్య, నర్సప్ప పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులను రెగ్యులర్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి. నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కిల్ కార్మికులకు నెలకు రూ.43, 162 చెల్లించాలని కోరారు. రెగ్యులర్ చేసే వరకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అంజిబాబు, తులసీరామ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



నగరంలోని ఓ దుకాణంలో క్రిస్మస్ సామగ్రి విక్రయాలు



ఆకట్టుకుంటున్న శాంతాక్లాజ్ బొమ్మ, స్టార్

● క్రిస్మస్ కళ

క్రైస్తవులకు క్రిస్మస్ అతి పెద్ద పండుగ. ఎంతో ఘనంగా జరుపుకునే ఈ వేడుక సందడి నగరంలో మొదలైంది. మార్కెట్‌లో క్రిస్మస్ ట్రీలు, స్టార్లు, లైట్స్, శాంతాక్లాజ్ బొమ్మలు, రంగురంగుల కాగితాలు, ఇంటి అలంకరణ వస్తువులు చూడగానే ఆకట్టుకుంటున్నాయి. ఇప్పటికే సెమిక్రిస్మస్ వేడుకలు ప్రారంభం కావడంతో వాటి కొనుగోళ్లు ఊపందుకున్నాయి.

-సాక్షి, ఫొటోగ్రాఫర్,కర్నూలు



గృహ అలంకరణ సామగ్రి





కలెక్టర్, జేసీలను కలసిన షేక్ జాఫ్రిన్

- స్పోర్ట్స్ కోటాలో గ్రూపు-1 అధికారిగా పోస్టింగ్



కలెక్టర్ సృజనతో షేక్ జాఫ్రిన్

కర్నూలు(అగ్రికల్చర్): స్పోర్ట్స్ కోటాలో గ్రూపు-1 అధికారిగా నియమితులైన షేక్ జాఫ్రిన్ సోమ వారం మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ సృజన, జాయింట్ కలెక్టర్ నారాపురెడ్డి మౌర్యలను కలిశారు. టెన్నిస్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అద్భుతంగా రాణించిన షేక్ జాఫ్రిన్ ప్రతిభ పాటవాలను గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్పోర్ట్స్ కోటా గ్రూపు-1 అధికారిగా ఉద్యోగం కల్పించింది. సహకార శాఖలో డిప్యూటీ రిజిస్ట్రార్‌గా నియమించింది. ఇటీవలనే ఆదోని డివిజన్ సహకార అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఆమె తాజా జిల్లా సహకార అధికారి ఎస్.రామాంజనేయులు, తండ్రి జాకీర్‌తో కలసి కలెక్టర్, జేసీలను మర్యాద పూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. డిజబులిటీ కలిగిన జాఫ్రిన్ రెండుసార్లు ఒలింపిక్ క్రీడల్లో మెడల్స్ సాధించారు. 9 ఇంటర్నేషనల్, 8 నేషనల్ మెడల్ సాధించారు. 2020లో రాష్ట్రపతి నుంచి బెస్ట్ స్పోర్ట్స్ పర్సన్ ఇన్ డిజబులిటీ జాతీయ అవార్డు తీసుకున్నారు. ఈమె ప్రతిభను గుర్తించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రూపు-1 అధికారిగా పోస్టింగ్ ఇవ్వడం విశేషం. ఆదోని డివిజన్ సహకార అధికారిగా నియమితులైన జాఫ్రిన్ జిల్లా స్థాయిలో ఆరు నెలలు ప్రాక్టికల్ శిక్షణ పొందుతారు. మరో ఆరు నెలలు థియరీలో శిక్షణ పొందుతారని జిల్లా సహకార అధికారి తెలిపారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనాలు అందించాలి



ధర్నా శిబిరం వద్ద మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డా.రామగిడ్డయ్య

కర్నూలు(అర్బన్): ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ. 26 వేలు అందించాలని, పనిభారం తగ్గించాలని సీఐటీయూ నేత పీఎస్ రాధాక్రిష్ణ కోరారు. ఆశా వర్కర్ల సమస్యలపై సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. ఆశా వర్కర్లకు సచివాలయ విధులు రద్దు చేయాలని, నాణ్యమైన 5జీ సిమ్‌లు ఇచ్చి వర్కర్లకు శిక్షణను ఇవ్వాలన్నారు. ముఖ్యంగా మెడికల్ లీవులు ఇవ్వాలని, మృతి చెందిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఉద్యోగ భద్రతకై 62 సంవత్సరాల సర్వీసును కొనసాగించాలన్నారు. 20 రకాల పని ఒత్తిళ్ల వల్ల ఆశ వర్కర్లు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు జయ నాగేశ్వరరావు మాట్లాడుతూ అత్యవసర పనులపై వెళ్లిన ఆశా వర్కర్ల వేతనాల్లో కోతలు పెడుతున్నారని, ఇదేమని ప్రశ్నిస్తే కింది స్థాయి అధికారులు కక్షతో వ్యవహరిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే ధర్నా శిబిరానికి వచ్చిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.రామగిడ్డయ్య మాట్లాడుతూ ఆశా వర్కర్లతో పలు రకాల పనులు చేయించరాదని గత మూడు నెలల క్రితమే పీహెచ్‌సీ డాక్టర్లకు సర్క్యూలర్ జారీ చేశామన్నారు. దీనిని ఎవరైనా పాటించకపోతే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆశా వర్కర్ల సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని నోడల్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్ చెప్పారు. ఈశ్వరీబాయి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా నాయకురాళ్లు శాంతకుమారి, దస్తగిరమ్మ, నాగార్జునమ్మ, సుబేదా, అనీత, రమిజాబీ, కాంతమ్మ, అలివేలమ్మ, సౌమ్య, సాలమ్మ తదితరులు పాల్గొన్నారు.